హరీశ్‌రావును కలిసిన దాచారం కనకయ్య

హరీశ్‌రావుకు పూలమొక్క అందించి ఆశీర్వాదం తీసుకుంటున్న దాచారం కనకయ్య

జగదేవపూర్, మే 16: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొండపోచమ్మ దేవాలయం మాజీ డైరెక్టర్ దాచారం కనకయ్య తన పుట్టినరోజును పురస్కరించుకొని శుక్రవారం మాజీ మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లో అతడి నివాసంలో ఆత్మకమిటీ మాజీ చైర్మన్ గుండారంగారెడ్డి ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావుకు పూలమొక్క అందజేసి ఆశీర్వాదం తీసుకున్నారు. మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎక్బాల్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నాగరాజు, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు కొత్త కవిత, బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు శ్రీను, మాజీ వార్డు సభ్యుడు గణేశ్, నాయకులు అలీ, భాస్కర్, దండె భాస్కర్, రాయవరం శ్రీను పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'పల్లా'కు ఆహ్వాన పత్రిక అందజేత



ఎమ్మెల్యే 'పల్లా'కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దానంపల్లి గ్రామస్తులు

చేర్యాల, మే 16: మండలంలోని దానంపల్లిలో నిర్వహించే గ్రామ దేవతల పండుగలకు హాజరుకావాలని కోరుతూ గ్రామస్తులతో పాటు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని శుక్రవారం కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.గ్రామంలో దుర్గమ్మ, బొడ్రాయి పండుగులతో పాటు గ్రామ దేవతలకు బోనాలు తదితర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు ఎమ్మెల్యేకు తెలిపారు. అంతకుముందు పట్టణంలో ఓ ఫంక్షన్‌హాల్‌లో జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పోచన్నపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు దంతూరి అజయ్‌గౌడ్ అక్షిత వివాహానికి హాజరై నూతన వధూవరులను ఎమ్మెల్యే పల్లా ఆశీర్వదించారు. బీఆర్ఎస్ చేర్యాల పట్టణ, చేర్యాల, కొమురవెల్లి మండలాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

బీరప్ప ఆలయానికి హరీశ్‌రావు గ్రానైట్ విరాళం

గ్రానైట్‌ను నిర్వాహకులకు అప్పగిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, మే 16: సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్‌లో నిర్మిస్తున్న బీరప్ప ఆలయానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు గ్రానైట్‌ను విరాళంగా అందజేశారు. గ్రామంలో దేవాలయం నిర్మించామని మీ వంతు సహాయం చేయాలని గ్రామానికి చెందిన కుర్మ సంఘం నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు హరీశ్‌రావును కలిసి కోరారు. దీంతో దేవాలయానికి అవసరమయ్యే లక్ష విలువగల గ్రానైట్‌ను అందించారు. ఈ సందర్భంగా దేవాలయానికి గ్రానైట్ అందజేసిన ఎమ్మెల్యే హరీశ్‌రావుకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, మే 16: హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల సాయిరామ్, ఎడ్ల సోమిరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎల్లారెడ్డి ఆరోపించారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఆంజనేయులు, పరశురామ్‌గౌడ్‌తో కలిసి వారు మాట్లాడారు. కల్లాల్లో రైతులు అల్లాడుతుంటే అందాల భామల పోటీల వెంట ముఖ్యమంత్రి తిరగడం సిగ్గుచేటన్నారు. అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే ప్రజా వ్యతిరేకత మూటగట్టుకున్న ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏఒక్క హామీని కూడా పూర్తిగా నెరవేర్చలేదన్నారు. ఆర్టీసీ లాభాల బాటలో ఉందన్న ముఖ్యమంత్రి ఆర్టీసీ, ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు పెంచుదామంటే అప్పు పుట్టడం లేదని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పరిపాలనపై పట్టురాలేదని, అడ్మినిస్ట్రేషన్ పూర్తిగా ఫెయిల్ అని ఆరోపించారు. రైతుబంధు, పంట రుణమాఫీ ఇప్పటికీ పూర్తి చేయలేదని, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ అమలు అంతంత మాత్రమేనని విమర్శించారు.

స్వయం ఉపాధి కోసం దరఖాస్తుల ఆహ్వానం

దుబ్బాక, మే 16: స్వయం ఉపాధి కోసం మహిళలు దరఖాస్తు చేసుకోవాలని దుబ్బాక మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ, ఆహార శుద్ధి పరిశ్రమల సంస్థల పథకంపై మహిళా సంఘాలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార ఉత్పత్తుల తయారీ కేంద్రాల ఏర్పాటు కోసం మహిళా సంఘాలు గరిష్టంగా రూ.10 లక్షల వరకు బ్యాంకు రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం నుంచి 35శాతం రుణమాఫీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, మెప్మా టీఎంసీ సరిత, యూనియన్ బ్యాంకు మేనేజర్, ఆర్పీలు పాల్గొన్నారు.

హనుమాన్ భక్తుల ఆందోళన

శివసాయి నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై మహేశ్

హుస్నాబాద్ టౌన్, మే 16: వైన్స్ పర్మిట్‌రూంలో పనిచేస్తున్న హనుమాన్ భక్తుడిపై ఎక్సైజ్ కానిస్టేబుల్ దాడిచేశారంటూ హుస్నాబాద్‌లో శుక్రవారం హనుమాన్ భక్తులు ఆందోళనకు దిగారు. బాధితుడి వివరాల ప్రకారం శ్రీకనకదుర్గావైన్స్‌కు అనుబంధంగా ఉన్న పర్మిట్‌రూంకు మధ్యాహ్నం సమయంలో హుస్నాబాద్ ఎక్సైజ్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ రాజమల్లారెడ్డి వచ్చారు. అక్కడ ఉన్న గట్టుశివసాయి అనే హనుమాన్ భక్తుడిని నాలుగు గ్లాసులు కావాలని అడిగి తీసుకున్నాడు. డబ్బులు ఇవ్వాలని కోరగా నేను ఎవరో తెల్వదా అని బెదిరించాడు. అనంతరం కానిస్టేబుల్ రాజమల్లారెడ్డి తనపై చేయిచేసుకున్నట్లు గట్టుశివసాయి చెప్పాడు. ఈ విషయం తెలుసుకున్న వివిధ పార్టీల నాయకులు స్థానిక ఎక్సైజ్‌కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. హనుమాన్ భక్తుడిపై దాడిచేసిన కానిస్టేబుల్ రాజమల్లారెడ్డిని సస్పెన్షన్ చేయాలంటూ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ ఆందోళనలో వివిధ పార్టీల నాయకులు బత్తుల శంకర్, వేణుగోపాల్‌రెడ్డి, దొడ్డి శ్రీనివాస్, పచ్చిమట్ల రవీందర్ గౌడ్, చందు, హనమాన్‌భక్తులు పాల్గొన్నారు.

రాజమల్లారెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సమాచారం తెలుసుకున్న ఎస్సై మహేశ్ జరిగిన ఘటనపై ఆరా తీశారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన కానిస్టేబుల్ రాజమల్లారెడ్డి క్షమాపణ చెప్పాలని పలువురు కోరగా, నేను క్షమాపణ చెప్పేది లేదని చెప్పడంతో హనుమాన్ భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కానిస్టేబుల్ రాజమల్లారెడ్డిని అదుపులోకి తీసుకుని, ఘటన జరిగిన శ్రీకనక దుర్గా వైన్స్‌లో సీసీ పుటేజీని పరిశీలించారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం

- రోజుల తరబడి రైతుల పడిగాపులు
- కొనుగోళ్లు వేగవంతం చేయాలని కర్షకుల డిమాండ్

ధూళిమిట్ట కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని ఆరబెడుతున్న మహిళా రైతు

మద్దూరు(ధూళిమిట్ట), మే 16: ధూళిమిట్ట మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. ధాన్యాన్ని అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు రోజుల తరబడి ఎదురుచూస్తున్నారు. సకాలంలో కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధూళిమిట్ట మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రాన్ని ఆలస్యంగా ప్రారంభించారు. కొనుగోలు కేంద్రంలో సరిపడా హమాలీలు అందుబాటులో లేక తీవ్ర సమస్యగా మారింది. దీనికి తోడు కొనుగోలు కేంద్రంలో ప్యాడ్లీక్లీనర్లు సరిపడా అందుబాటులో లేక కొనుగోళ్లలో జాప్యం జరుగుతుంది. మిల్లర్ల కేటాయింపులో కూడా జాప్యం జరగడంతో సమస్య ఉత్పన్నమైందని రైతులు అభిప్రాయపడుతున్నారు. కొన్నిసార్లు ధాన్యంలో నూక వస్తుందనే సాకుతో మిల్లర్లు వెనుకకు పంపిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు 30శాతం ధాన్యం కొనుగోళ్లు కూడా పూర్తి కాలేదని రైతులు మండిపడుతున్నారు. ఓ వైపు వానకాలం ముంచుకొస్తున్నా కొనుగోళ్లు పూర్తికాకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి కొనుగోలు కేంద్రంలోని ధాన్యం తడిసిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ధూళిమిట్ట కొనుగోలు కేంద్రంలో 148 మంది రైతుల నుంచి 7,104 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు పీఏసీఎస్ అధికారులు తెలిపారు.

ధూళిమిటలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సింహాచలం మధుసూదన్

కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన తహసీల్దార్

ధూళిమిట్ట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ సింహాచలం మధుసూదన్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధూళిమిట్టలో ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరగడంపై ఆరా తీసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరారు. ఎప్పటికిప్పుడు కాంటాలు నిర్వహించాలని హమాలీలకు సూచించారు. అవసరమైతే ఇతర గ్రామాల నుంచి హమాలీలను తీసుకురానున్నట్లు తెలిపారు. మిల్లర్లతో మాట్లాడి లారీలు పంపించాలని కోరినట్లు తెలిపారు. కొనుగోలు సెంటర్ వద్ద అవసరమైతే రెవెన్యూ సిబ్బందిని అందుబాటులో ఉంచి కొనుగోళ్లు ముందుకుసాగే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం

దౌలాపూర్‌లో రైతులకు సూచనలు చేస్తున్న అధికారులు

జగదేవపూర్, మే 16: ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని ఆయిల్ ఫెడ్ ఏరియా ఆఫీసర్ శంకర్, మండల ఉద్యానశాఖ అధికారి రమేశ్, మండల వ్యవసాయాధికారి వసంతరావు రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని దౌలాపూర్‌లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులు ఉపేందర్‌రెడ్డి, మంజ నర్సమ్మ పంటలను క్షేత్ర స్థాయిలో వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులు ఆయిల్ పామ్‌సాగులో అంతర పంటలుగా పూల మొక్కలు, బొప్పాయి, అరటి సాగు చేయవచ్చన్నారు. గొర్రెల పెంపకం, డెయిరీ ఏర్పాటు చేసుకొని అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు ఉపేందర్‌రెడ్డి, బంగార్‌రెడ్డి, మైపాల్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ విజయ, ఏఈవో ఖలీల్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే దోమల నివారణ

గజ్వేల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సిద్దిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

గజ్వేల్, మే 16: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే దోమలను నివారించవచ్చని శ్రీగిరిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి బల్బీర్‌సింగ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా కోటమైసమ్మ దేవాలయం నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మురుగు నిల్వకుండా చూసుకోవాలన్నారు. వ్యాధులను అరికట్టాలంటే పరిసరాల పరిశుభ్రతే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దిపేటలో డెంగీపై అవగాహన ర్యాలీ

సిద్దిపేట, మే 16: పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని డాక్టర్ శ్రీకాంత్ సూచించారు. సిద్దిపేటలో జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు డెంగీ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారులు డాక్టర్ ముద్దసిర్, డాక్టర్ రాజేందర్, ఫైలేరియా ఆరోగ్య విస్తరణ అధికారి కాల్వ చక్రధర్, కె.కొండయ్య, నాగేందర్‌రెడ్డి, సుధీర్, కోటేశ్వరరావు, రవి, ప్రభు, సాయి, అజార్ పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

ర్యాలీలో పాల్గొన్న చాడ వెంకటరెడ్డి తదితరులు

అక్కన్నపేట, మే 16: ఆపరేషన్ కగార్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని గోవర్ధనగిరిలో ఆపార్టీ మండల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అంతకుముందు ఆయన కార్యకర్తలతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్, మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్, నాయకులు జాగీరు సత్యనారాయణ, ఎడల వనేశ్, కొయ్యడ కొమురయ్య, జేరిపోతుల జనార్దన్ పాల్గొన్నారు.

న్యాయవ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్ర: సీపీఐ

హుస్నాబాద్‌టౌన్, మే 16: దేశంలో న్యాయవ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రజరుగుతుందనిచ, అందులో భాగంగానే సుప్రీం కోర్టుకు రాష్ట్రపతి 14ప్రశ్నలు సంధించారని సీపీఐ జాతీయకార్యవర్గసభ్యుడు చాడవెంకటరెడ్డి అన్నారు. హుస్నాబాద్ సీపీఐ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమిళనాడు శాసనసభ చేసిన చట్టాన్ని గవర్నర్ ఆమోదించలేదని దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్తే రాష్ట్రపతి నిర్ణయం తీసుకోవాలని సూచించిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధానమంత్రి మోదీ రాజ్యాంగాన్ని అపహాస్యం పాలుచేసేవిధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గౌరవెల్లి రిజర్వాయర్ కింద కాల్వలకు రూ.437కోట్లు మంజూరుచేశామని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ చెబుతున్నారని కాని నేటికీ వాటికి టెండర్లు కూడా పిలవలేదన్నారు. గౌరవెల్లి రిజర్వాయర్ ఎడమకాల్వ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు సీపీఐ బృందం ఈనెల 29న పర్యటన చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సీపీఐ జిల్లాకార్యదర్శి మంద పవన్, రాష్ట్రసమితిసభ్యులు గడిపె మల్లేశ్, జిల్లాకార్యవర్గసభ్యులు పోతిరెడ్డి వెంకటరెడ్డి, నాయకులు జాగీరు సత్యనారాయణ, వనేశ్, లక్ష్మణ్, అశోక్ పాల్గొన్నారు.

'ఉల్లాస్'పై అవగాహన

జగదేవపూర్, మే 16: టెన్త్, ఇంటర్ మధ్యలో చదువుమానేసిన వారికి నూతన జాతీయ విద్యావిధానం ద్వారా చదువుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఎంఈవో మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కార్యాలయంలో గ్రామైక్య మహిళా సంఘం అధ్యక్షులు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులకు ఉల్లాస్ (అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ సొసైటీ)పై సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యలో బడిమానేసి 14 ఏండ్లు పైబడిన వారందరూ చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఎంపీవో ఖాజామోహినుద్దీన్, సూపరింటెండెంట్ ఆంజనేయులు ఎంఐఎస్ గోవర్ధన్, సీఆర్పీలు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ విద్య అందించాలి

మద్దూరు(ధూళిమిట్ట), మే 16: నిరక్షరాస్యులైన ప్రతి ఒక్కరికీ విద్య అందించేందుకు కృషి చేయాలని మద్దూరు, ధూళిమిట్ట ఎంఈవోలు వరదరాజు, మీనాంజనేయులు కోరారు. శుక్రవారం మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రామ్మోహన్ అధ్యక్షతన ఉల్లాస్(అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ సొసైటీ), టాస్(తెలంగాణ ఓపెన్‌స్కూల్ సొసైటీ)పై ఉమ్మడి మద్దూరు మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 నుంచి 50ఏండ్లలోపు ఉన్న వయోజనులను గుర్తించి, పదిమందికి ఒక వలంటీర్ చొప్పున నియమించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. కొంత చదువు వచ్చి పదో తరగతి పూర్తికాని వారిని ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి పూర్తిచేసేలా చూడాలన్నారు. సమావేశంలో ఏపీఎం బాబురావు, అన్ని పాఠశాలల హెచ్ఎంలు, మహిళా సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

కర్కపట్లలో కార్డన్‌సెర్చ్

మాట్లాడుతున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

మర్కూక్, మే 16: డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి సూచించారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలోని కర్కపట్లలో గురువారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల రక్షణ,భద్రత చర్యల్లో భాగంగా కార్డన్‌సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఎవరైనా కొత్త వ్యక్తులు, నేరస్తులు వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం కార్డన్‌సెర్చ్ ద్వారా తెలుస్తుందన్నారు. యువత సన్మార్గంలో నడవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. ఎవరైనా గంజాయి అమ్ముతుంటే వెంటనే 100 డయల్‌కు ఫోన్ చేయాలన్నారు. గ్రామంలో స్వాధీనం చేసుకున్న వాహనాలకు సంబంధించి పత్రాలు చూపించి తీసుకొని వెళ్లవచ్చన్నారు. గ్రామం లో ఎలాంటి అనుమతి లేకుండా బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న ఇంటిపై దాడి చేసి 10.70 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రతిఒక్కరూ తమ వాహనాలకు సంబంధించిన పత్రాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సైలు దామోదర్, కరుణాకర్‌రెడ్డి, విజయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలి

నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

చేర్యాల, మే 16: చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు,ధూళిమిట్ట మండలాలను కలిపి చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ కోరారు. మండలంలోని వీరన్నపేటలో శుక్రవారం సీపీఐ గ్రామశాఖ రెండో మహాసభ జరిగింది. పార్టీ జెండా ఆవిష్కరించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని అర్హతలు కలిగిన చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. చుంచనకోట నుంచి వీరన్నపేట మీదుగా జనగామ, సిద్దిపేట జాతీయ రహదారి వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలన్నారు.చేర్యాలలో సమీకృత ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని తీర్మానించారు. అనంతరం గ్రామ కమిటీ కార్యదర్శిగా పొన్నబోయిన శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా చిగుళ్ల నరేశ్, బింగి లింగం, కోశాధికారిగా చిగుళ్ల నాగరాజు, సోషల్ మీడియా అధ్యక్షుడిగా పిల్లికండ్ల నర్సింహులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, వెంకటేశ్, భూమయ్య, నంగి కనకయ్య, మహేందర్, సత్తయ్య పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలే పవిత్ర గ్రంథాలు

నాగపురిలో విద్యా సంబంధ బహుళ కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

చేర్యాల, మే 16: పాఠ్యపుస్తకాలే పవిత్రగ్రంథాలు అని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎలికట్టె అయిలయ్య, పీఎస్ హెచ్ఎం పిన్నింటి మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాగపురిలో శుక్రవారం ముందస్తు బడిబాట, మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్, ఉల్లాస్,హ్యాపీ ప్లే స్కూల్ తదితర విద్యా సంబంధ బహుళ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన అన్ని వసతులు ఉన్నాయని, విద్యార్థులను సర్కారు బడిలో చేర్పించాలని కోరారు. ఉపాధ్యాయులు, సిబ్బంది రామాంజనేయులు, ఎస్.నిరుపమా, అందే విజయ్ కుమార్, గొట్టం ప్రకాశ్‌రెడ్డి, కర్రోళ్ల స్వర్ణకుమార్, పి.రాజేశ్వరి, ఎస్.కనకలింగం, బోపూరి బాల్‌రెడ్డి, బొల్లం సంపత్, స్వామి, మాజీ ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, నాయకులు బండకింది కరుణాకర్, గూడెపు మహేశ్, ప్రజ్ఞాపురం నర్సింహులు, మోకు దేవేందర్‌రెడ్డి, కుందారపు రాములు, పంచాయతీ కార్యదర్శి ఏలూరు రాజు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషిచేయాలి

మంత్రి పొన్నం ప్రభాకర్

మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట, మే 16: జిల్లాలో విద్యాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కృషి చేయాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట ఐడీవోసీలోని సమావేశ మందిరంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అధ్యక్షతన దిశ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ శాఖల్లో కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో అమలవుతున్న ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రగతిపై ఎమ్మెల్సీలు మాల్క కొమురయ్య, సి.అంజిరెడ్డి, కలెక్టర్ మనుచౌదరితో కలిసి సమీక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం హాజరై మాట్లాడారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలతో ప్రజలు అధికంగా లబ్ధిపొందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎన్సాన్‌పల్లిలో రైతులు, వ్యాపారులకు ఇబ్బంది కలుగకుండా జాతీ య రహదారిపై ఫ్లైఓవర్ నిర్మిస్తున్నామన్నారు. సిద్దిపేట లైబ్రరీ నుంచి రంగధాంపల్లి ఊరు చివరి వరకు ఫ్లైఓవర్ నిర్మించేందుకు కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. సూర్యాపేట– సిరిసిల్ల రహదారిని దుద్దెడ నుంచి రాజీవ్ రహదారి సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ మీదుగా వెళ్లేలా ప్రణాళికలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. మెదక్ ఎల్కతుర్తి జాతీయ రహదారికి ఇరువైపులా ఓపెన్ డ్రెయిన్లపై స్లాబ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేయడానికి ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. హర్ ఘర్ సూర్య యోజన పథకం కింద దుద్దెడ గ్రామాన్ని తీసుకొని సోలార్ విద్యుత్ అందించాలన్నారు. వచ్చే సంవత్సరం టెన్త్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా విద్యాశాఖ అధికారులు ప్రణాళికాబద్ధంగా బోధన చేయాలన్నారు. మల్లన్న సాగర్ ప్రభావిత గ్రామం తుక్కాపూర్‌లో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మించి తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. పీఎం విశ్వకర్మ పథకం ద్వారా దరఖాస్తు చేసుకున్న వారందరికీ త్వరగా లోన్ మంజూరయ్యేలా చూడాలన్నారు. ఎంపీ నిధులు మంజూరు చేస్తే కనీసం తమకు తెలియకుండా పనులు ఎలా చేస్తారని ప్రశ్నించారు. అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్, డీఆర్డీవో జయదేవ్ ఆర్యా పాల్గొన్నారు.

మతసామరస్యాన్ని చాటుకున్న ముస్లిం యువకుడు